www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్


గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్


సంపుటి : 2 | సంచిక : 34 | 30-05-2022 | పుటలు : 4


## జక్కంపూడి చొరవతో నన్నయకు నిధులు విడుదల




**26.05.22 (మీడియాసెల్)** రాజానగరం శాసన సభ్యులు జక్కంపూడి రాజా చొరవతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి పెండింగ్ నిధులు విడుదల అయ్యాయని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. గురువారం యూనివర్సిటీలోని పెండింగ్ నిధుల విడుదలకు సంబంధించిన వివరాలను వీసీ తెలియజేసారు. జక్కంపూడి రాజా చొరవతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్ల నిధులను విడుదల చేసిందని అన్నారు. విశ్వవిద్యాలయంలోని భవన నిర్మాణాలు మరియు అభివృద్ధి కొరకు 10 కోట్ల రూపాయలు నిధులు విడుదల చేసేందుకు జక్కంపూడి రాజా ఎంతో కృషి చేసారని చెప్పారు. మిగిలిన పెండింగ్ నిధులను కూడా వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి గోదావరి జిల్లాల విద్యా కేంద్రంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాన్ని జక్కంపూడి రామ్మోహనరావు ప్రోత్సాహంతో డా.వై.రాజశేఖరరెడ్డి రాజమహేంద్రవరంలో 2006 వ సంవత్సరంలో ప్రారంభించారని గుర్తుచేసారు. దివంగతనేతలు డా.వై.ఎస్.ఆర్, జక్కంపూడి రామ్మోహనరావు ప్రోత్సాహంతో ఏర్పడిన విశ్వవిద్యాలయం వారి కుమారులు వై.ఎస్.జగన్మోహనరెడ్డి, జక్కంపూడి రాజాల ప్రోత్సాహంతో, కృషితో అభివృద్ధిని సాధిస్తుందన్నారు. విడుదల చేసిన రూ.10 కోట్ల రూపాయలతో విశ్వవిద్యాలయ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేస్తామన్నారు. తద్వారా గోదావరి వాసులను మరిన్ని విలువైన నూతన కోర్సులు అందుబాటులోకి వస్తాయని, అందరికి నాణ్యమైన విద్యను అందించాలనే మహనీయుల ఆశయాలు సాధ్యమవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా సి.ఎం. జగన్ కు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు వీసీ కృతజ్ఞతలు తెలియజేసారు. విశ్వవిద్యాలయ పెండింగ్ నిధుల విడుదలకు కృషి చేసిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, నిధులు విడుదల చేసిన సి.ఎం. జగన్మోహనరెడ్డికి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి కృతజ్ఞతలు తెలిపారు.

### మంచి మాట




## పరీక్షల నిర్వహణకు పక్కా ప్రణాళికలు రచించండి


**28.05.22 (మీడియాసెల్)** సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ సమర్ధవంతంగా పరీక్షలను నిర్వహించేందుకు పక్కా ప్రణాళికలను సిద్ధం చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో విశ్వవిద్యాలయ పరీక్ష విభాగాధికారులతో వీసీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఐదు జిల్లాల్లో నాలుగు వందలకు పైగా కళాశాలల్లోని లక్షకు పైగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం చాలా పెద్ద ఛాలెంజ్ గా ఉందని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ పరీక్షలు నిర్వహించేందుకు కావల్సిన మార్గాలను అన్వేషించాలని చెప్పారు. పరీక్షల నిర్వహణ సౌలభ్యం మరియు సెక్యూరిటీ పరంగా పరీక్ష కేంద్రాలకు సమాయానికి ఆన్లైన్ ద్వారా ప్రశ్నపత్రాలను పంపించడం ఒక చక్కని మార్గమని తెలిపారు. తద్వారా నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని యూజీ, పీజీ, లా, బిఈడీ, ఇంజనీరింగ్ వంటి సుమారు 150 పరీక్ష కేంద్రాలకు ఆన్లైన్ విధానంలో పరీక్ష పత్రాలను ఒక గంట ముందే పంపించవచ్చునని చెప్పారు. పరీక్ష పత్రాల చేరవేతకు పూర్తి భద్రతతో కూడిన ఇంటర్నల్ సాఫ్ట్ వేర్ ను రూపొందించాలని ఆదేశించారు. జె.ఎన్.టి.యు.కె వారు ఆన్లైన్ ప్రశ్నపత్రాల చేరవేతను చాలా కాలంగా నిర్వహిస్తున్నారని, ఆ విధానాన్ని పూర్తిగా అధ్యయనం చేయడానికి నన్నయ విశ్వవిద్యాలయ పరీక్ష విభాగ అధికారుల కమిటీని పంపిస్తామన్నారు. అలాగే ఆన్లైన్ మూల్యాంకనంపై కూడా కసరత్తు చేయాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆటోమేషన్ విధానంలో పరీక్ష పత్రాల



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

మూల్యాంకనం చేసి ఫలితాలను మరింత వేగవంతంగా అందించేందుకు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, డీన్ ఎగ్జామినేషన్ డా.ఎ.మట్టారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎస్.లింగారెడ్డి,డీన్ సిడిసి డా.పి. వేంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.విజయకుమారి, సిస్టమ్ మేనేజర్ కం ప్రోగ్రామర్ వి.ఎ.ఎం.జ్యోతి,ఫ్యాకల్టీ అసోసియేట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం



## రవీంద్రుడు-ప్రకృతి

కవులు ప్రకృతి ఉపాసకులు.కవులు ప్రతిభాపాటవాలు ప్రకృతి ధర్మాలు. మనిషి జీవనవిధానం,మానవేతరమైన ప్రకృతి లక్షణం కావ్య,కవిత్వ నిర్మాణానికి పరికరాలు.మనిషితో సంబంధంలేని ప్రకృతి కళాహీనమైంది. ప్రకృతితో సంబంధంలేని మానవజీవితం వ్యర్థమైంది. ఈ రెండూ పరస్పర పూరకాలు. ప్రకృతికి, మానవ జీవితానికి ఉండే మానవ సంబంధాన్ని తాత్విక,మార్మికతతో తన కవిత్వం ద్వారా అందించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్.

ప్రకృతి సౌందర్యాన్ని,మార్దవాన్ని దర్శించి, ఆరాధించిన మహాకవి ఆయన. నిత్యకృత్యంగా ప్రకృతితో పరవశమై అహోరాత్రాలు పాడుకున్న పాటలే అద్భుత విశ్వపు సృష్టికర్తతో అత్యంత సన్నిహితంగా ఆడుకున్న స్వేచ్ఛాలాపములే రవీంద్ర సంగీతం. ఆ ప్రకృతి కవిత్వ సంగీతంతో సప్తమైన మానవ చేతస్సుని సుని శాశ్వత ధర్మగీతికలతో జాగృతం చేయడానికి కేవలం కవితా ప్రతిభ తోనే కాక, అసాధారణమైన వ్యక్తిత్వంతో, అప్రతిహతమైన శక్తితో ఋషివంటి విశాల విశ్వదర్శనంతో, సునిశితమైన మేధాశక్తితో ఆనంద మధువును అందరికీ అందించిన విశ్వకవి రవీంద్రులు.

తత్వ గాంభీర్యం,భావనా సౌకుమార్యం, కోమలమైన చేతస్సు రవీంద్రుని సాహిత్య ప్రధాన లక్షణాలు. ప్రకృతిలోని కోమలమైన సౌకుమార్యాన్ని, సౌందర్యాన్ని, ఆనందాన్ని, అపార భావ సముదాయాన్ని, గంభీరమైన తత్వాన్ని,కరుణను రవీంద్రులు దర్శించారు. ఆ మధురమైన తన ప్రకృతి భావనల్ని మనకు తన కవిత్వం ద్వారా అందించారు. తాను ప్రకృతి సౌందర్యాన్ని విలోకించడంలోనే తన వ్యక్తిత్వ వికాసమంతా సాధ్యమైనట్లు వివరించారు. “ఎ పొయట్స్ స్కూల్”(ఒక కవి పాఠశాల) వ్యాసంలో... బాల్యం నుండి విద్యా విధానం ప్రకృతి సౌందర్య విలోకనంతో పొందుపరచి ఉండాలని, సంతోషంగా విద్యాభ్యాసం కొనసాగించాలని అన్నారు.భారతీయ తత్వచింతనమంతా చుట్టూ కనిపించే అందమైన ప్రకృతితో సామరస్యాన్ని సాధించడంలోనే మానవ సాఫల్యం ఉన్నట్లు తెలుపుతుందన్నారు. ఆయన భావన ప్రపంచమంతా ప్రకృతి పారవశ్యంలో రూపొందింది. ప్రకృతితో తనకున్న తాదాత్మ్యాన్ని ఇలా వివరించారు.

“ ప్రకృతిని ప్రేమిస్తే భావపరిధి విస్తరిస్తుంది. సోదర మానవుల్ని ప్రేమించే అవకాశం లభిస్తుంది. పరస్పర ప్రేమతో జీవించడం ముఖ్యంగాని పొరుగు దేశాల ఎల్లలు సమీక్షిస్తూ వారి భౌగోళిక పరిస్థితుల్ని తెలుసుకుంటే ప్రపంచమంతా తెలిసినట్లు కాదు. దాని వలన ప్రయోజనమూ లేదు. నన్ను ఆకాశమంత ఎత్తు సింహాసనంపై

కూర్చుండబెడదామనుకున్న వాళ్ళంటే నాకు గిట్టదు. నేనీనేల ఒడిలో పుట్టినవాణ్ణి.చెట్లమధ్యన, అడవుల్లో,ధూళిలో,నేలపై,గడ్డిలో నా జీవితాన్నంతా ధారపోసినవాణ్ణి. ఈ నేలను ప్రేమించిన వాళ్లకి, నేలపైనే జీవితమంతా గడిపిన వాళ్లకి, చివరికి ఈ నేలలోనే కలిసి పోయేవాళ్ళకీ నేను మిత్రుణ్ణి. స్వర్గాన్ని వెతుకుతూ పోతే ఎక్కడా లభించదు. స్వర్గం ఇక్కడే ఈ నేలపైనే సూర్యకాంతిలో, పచ్చని పచ్చికలో, అందమైన ముఖంలో, మానవ జీవితంలో, నిత్యం మనం నిర్లక్ష్యంచేసే చిట్టి పొట్టి వస్తువుల్లో ఉంది. ఈనేలపై ఏ వైపునకు చూసినా స్వర్గం సాక్షాత్కరిస్తుంది”

మానవుని గురించి,భగవంతుని గురించి రాసిన దానికంటే ఎక్కువగా రవీంద్రులు ప్రకృతిని గురించి ఎక్కువ రాశారు. పసి పిల్లలను కూడా రవీంద్రుడు ప్రకృతిలోనే చేర్చారు.

రవీంద్రులు భారతీయాత్మకు ప్రతీక. భారతదేశం బానిసత్వంలో మగ్గుతున్న కాలంలో ఆత్మ విశ్వాసాన్ని కోల్పోయి దీనావస్థలో ఉన్నప్పుడు భారతదేశ ఆధ్యాత్మిక వైభవాన్ని వివేకానందుడు ప్రపంచానికి పరిచయం చేస్తే భారతీయ సాహితీ వైభవాన్ని విశ్వమంతటా వినిపించింది రవీంద్రుడు.

గీతాంజలి, స్ట్రే బర్డ్స్, జాతీయగీతాల్లో ప్రకృతి వర్ణన ఎంతో సౌందర్యపూరితంగా కనిపిస్తుంది.ఆయన తన చుట్టూ ఉన్న పరిసరాలకు ప్రభావితమై రచనలు చేశారు.ఆయన రాసిన జనగణమన గీతాన్ని మనం సగర్వంగా,సగౌరవంగా పాడుకుంటూనే ఉంటాం.

# ఠాగూర్ దృష్టిలో విద్య

## పుస్తకం



విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ విద్య గురించి అనేక అమూల్యమైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. రవీంద్రుని అభిప్రాయాలను అందరిని ఆకట్టుకునే విధంగా శ్రీమతి విజయ నీలగ్రీవం గారు తెలుగులోకి చక్కగా అనువాదం చేశారు.

పిల్లలకు ఐదు సంవత్సరాలు నిండే వరకు బడిలో చేర్చకూడదని, ఆ సమయములో శరీరాన్ని మట్టితో పులుముకోవాలని, చెట్లెక్కి పండ్లు కోసే విధంగా ఉండాలన్నారు. ఆ సమయంలో మనసారా ఆడుకోనివ్వాలని, గెంతులు వేయాలని, అనేక రంగులను పులుముకున్న పొలాలను చూసి తరలించాలని, ఈ విధంగా పిల్లల జీవితాలను సస్యశ్యామలం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఈ పుస్తకంలో రవీంద్రుడు ఉపాధ్యాయునికి,గురువుకి మధ్య గల భేదాలను చాలా బాగా వర్ణించారు. ఉపాధ్యాయుడు వేతనాన్ని గ్రహించి విద్యను అమ్ముతాడని,గురువు విద్యార్థుల్లో జీవం పోయడం తమ జీవిత ధ్యేయంగా భావిస్తారని చెప్పారు. గురువులు తమ జ్ఞానం ద్వారా విద్యార్థుల్లో జ్ఞాన జ్యోతిని వెలిగిస్తారనీ, జీవితం గడపడానికి వేతనం తీసుకున్నా, ప్రతిఫలంగాఎక్కువ జ్ఞానం అందించి విద్యార్థుల మనస్సులో ఉన్నత స్థానాన్ని పొందుతారని చక్కగా వర్ణించారు.

నేటి పిల్లలు అమూల్యమైన పసి హృదయ సమయాన్ని విదేశీ భాషలు నేర్చుకోవడానికి, బండెడు పుస్తకాలు చదవడానికి తన సమయాన్ని గడుపుతున్నారని, అందులో ఆనందానుభూతి లేదని, ఆలోచన శక్తి లేకుండా కంఠస్తం చేయడమే జరుగుతుందని చెప్పారు. ఆంగ్ల భాషలో పుస్తకాల గుట్టలు మింగిన బుద్ధి మాత్రం వికసించడం లేదని అన్నారు.

ప్రస్తుత విద్యా విధానంలో అనేక లోపాలు ఉన్నాయని... మన విద్యను గోడల్లో బంధించి, ద్వారాలతో అడ్డగించి, పిల్లలను కూర్చోబెట్టి బట్టీ పట్టించి విద్యను నేర్పిస్తున్నారని, పిల్లలు పనికిరాని వారిగా చేస్తున్నారని ఆయన అభిప్రాయం.

మనం చదివే చదువుకు, జీవితానికి ఎటువంటి సంబంధం ఉండడం లేదని, మనిషి ఒక వైపు జీవితం సాగిస్తూఉంటే..విద్య మరోవైపు సాగుతుందని చెప్పారు. ఇలా జీవితాంతం నేర్చుకున్న చదువు గుమస్తాగిరి చేయడానికే సరిపోతుందని, ఆదర్శ జీవితం గడిపే చదువు ఇలాంటి పాఠ్యాంశాల్లో దొరకడం లేదన్నారు.

ఇందుకోసం ఆయన నేటి అవసరాలకు చక్కగా గుర్తించి ఉపయోగకరమైన పాఠ్యాంశాలను పాఠ్యప్రణాళికను రూపొందించుకోవాలని ఈ పుస్తకంలో చెప్పారు. విద్యార్థులు కేవలం మూస విద్యావిధానానికి పరిమితం కాకుండా.. అనేక విభిన్న పాఠ్యాంశాలను నేర్చుకోవాలని చెప్పారు. విద్యా విధానం భారతీయుల ఆత్మను కదిలించాలని, విద్యార్థుల్లో జీవం




కలిగించేలా ఉండాలని, బాల్యం నుండి వాస్తవిక విద్యను అందించి విద్యార్థులను రేపటి పౌరులు గా తీర్చిదిద్దే విధంగా విద్య ఉండాలని ఈ పుస్తకంలో సమగ్రంగా వివరించారు.

మన చదువుకు, జీవితానికి సమానత్వం కలిగించేలా ఉండే ఈ పుస్తకం అందరూ చదవగలిగే విధంగా ఠాగూర్ విద్యా విధానాలను తెలుగులోకి చక్కగా అనువాదం చేశారు. ఈ పుస్తకాన్ని అందరూ చదివి ఠాగూర్ వెలిబుచ్చిన విద్యా విధానాలను గ్రహించాలని మనవి.

– బి.సుశాంత్ కుమార్
బి.ఎడ్. ద్వితీయ సంవత్సరం, ఆదికవి నన్నయ యూనివర్సిటీ.

# ఫ్యాకల్టీ అసోసియేట్‌గా రాజరాజేశ్వరిదేవి

**27.05.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని నన్నయభారతి, నన్నయ స్టడీ సెంటర్ లకు ఫ్యాకల్టీ అసోసియేట్ గా ఎడ్యుకేషన్ కళాశాల అధ్యాపకురాలు డా. కడలి శ్రీరాజరాజేశ్వరిదేవిని నియమిస్తూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఉత్తర్వులు అందించారు. యూనివర్సిటీలో వీసీ కార్యాలయంలో రాజరాజేశ్వరిదేవికి ఉత్తర్వులు అందించిన వీసీ జగన్నాథరావు వివరాలను తెలియజేసారు. వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో దాతలు సమర్పించిన పుస్తక భాండాగారంగా ఏర్పాటు చేసిన నన్నయభారతి, గోదావరి జిల్లాల అధ్యయన కేంద్రంగా ఏర్పాటు చేసిన నన్నయ స్టడీ సెంటర్ లకు ఫ్యాకల్టీ అసోసియేట్ గా రాజరాజేశ్వరిదేవిని నియమించామన్నారు. నన్నయభారతి, నన్నయ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ బాధ్యతలు నిర్వహిస్తున్న డా.తలారివాసుతో కలసి ఫ్యాకల్టీ అసోసియేట్ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. అలాగే 2022-23 విద్యా సంవత్సరం నుండి క్యాంపస్ లోని విద్యార్థులతో పాటు అసక్తిగలవారికి సర్టిఫికెట్, డిప్లొమా డాన్స్ కోర్సులు అందించేందుకు రాజరాజేశ్వరి సేవలను




ఫాకల్టీ అసోసియేట్‌గా బాధ్యతలందిస్తున్న వీసీ జగన్నాథరావు

ఉపయోగించుకుంటున్నామన్నారు. కళాలకు పుట్టినిలైన గోదావరి జిల్లాల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో సాంస్కృతిక కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నామని తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి రాజరాజేశ్వరిదేవిని అభినందించారు.

ప్రతిభా వాణి

# తెలుగు నేలను సంస్కరించిన మహనీయుడు కందుకూరి




తెలుగు నేలమీద సంఘ సంస్కర్తల జాబితాలో కందుకూరి వీరేశలింగానికి ప్రత్యేక స్థానం ఉంది. 1848 ఏప్రిల్ 16న రాజమహేంద్రవరంలోని అఖండ గోదావరి తీరంలో జన్మించిన కందుకూరి అనతికాలంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు. ఉపాధ్యాయునిగా పనిచేస్తూ పిల్లలకు పాఠాలతో పాటు సంఘ సంస్కరణ భావాలను కూడా బోధించి వారిలో చిన్నతనం నుండి ఆదర్శ భావాలు పెంపొందించేవారు.

సమాజంలో దురాచారాలకు వ్యతిరేకంగా తన భావాలను వ్యాప్తి చెయ్యడానికి 1874 అక్టోబర్లో 'వివేకవర్ధని' అనే పత్రికను ప్రారంభించారు. ఈ పత్రిక ముఖ్య ఉద్దేశం సంఘంలోని అవకతవకలను, దురాచారాలను నిర్మూలించడమే.

అలాగే అంటరాని కులాలుగా భావించిన వారి పిల్లలను బడిలో చేర్చుకొని మిగతా పిల్లలతో పాటు కూర్చోబెట్టేవారు. వారికి ఉచితంగా పుస్తకాలు,పలక బలపం,చదువు అందించేవారు. అన్నింటికీ మించి మహిళా ఉద్ధరణకు విశేష ప్రాధాన్యం ఇచ్చారు బాల్యవివాహాలు అధికంగా ఉండే ఆరోజుల్లో వితంతు పునర్వివాహాలు జరపడం కందుకూరి సాహసానికి నిదర్శనం.

సంఘ సంస్కరణ విషయంలో ప్రచారంతో సరిపెట్టకుండా కార్యాచరణ చేపట్టడం కందుకూరి ప్రత్యేకత. అందుకే కందుకూరి చేసిన సేవలకు గుర్తింపుగా వందేళ్ల తర్వాత కూడా ఈనాడు ఆయనను గుర్తు పెట్టుకుంటున్నాం. నేటి ఆధునిక భావజాలం ఆనాడు ఆయనలో కనిపించడం విశేషం. స్త్రీలు బయటకు వెళ్లి చదువుకునే అవకాశం లేని ఆరోజుల్లో బాలికల కోసం ప్రత్యేకంగా ధవళేశ్వరంలో బాలికల పాఠశాలను ప్రారంభించారు.

సమాజ సేవ కోసం 1905లో 'హితకారిణి సమాజం' స్థాపించి తన యావదాస్తిని సమాజం కోసం ఇచ్చేశారు. తెలుగులో 130కి పైగా గ్రంథాలు రచించారు. ఇందులో సగం సమాజంహితం కోసం రాసినవే. 1881 డిసెంబర్ 11న శ్రీరాములు గౌరమ్మకు పునర్వివాహం జరిపించి, సమాజం నుంచి వెలివేయబడినా మొండి పట్టుదలతో 40 వితంతు వివాహాలు జరిపించారు.

ఆంధ్ర సమాజాన్ని సంస్కరణల బాట పట్టించిన సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు. నిరంతరం సమాజంలో దురాచారాలతో పోరాడి సమకాలీన సమాజంలో కుళ్ళును ఎత్తిచూపుతూ, రకరకాల మూఢనమ్మకాలను ఖండించి, ఆంధ్రదేశాన్ని పునరుద్ధరించారు.

అందుకే చిలకమర్తి లక్ష్మీ నరసింహం ఆయన గురించి ఈ విధంగా రాశారు...."తన దేహము తన గేహము..తన కాలము తన
ధనంబుతన విద్యజగ
జ్జనులకే వినియోగించిన
ఘనుడీ వీరేశలింగంకవి జనులారా"

చివరిగా ఒక్క మాట.....
గోదావరి తీరానకోటి లింగాలు ఉన్నాయి. ఎన్నో లింగాలునదీ ఉధ్ధృతికి కొట్టుకుపోయాయి. ఒక్క లింగం మాత్రమే మిగిలిపోయింది. అదే వీరేశలింగం.
తెలుగువారిని, ఆంధ్ర దేశాన్ని సంస్కరించిన ఈ మహనీయుడు 27-05-1919 న తన 71 సంవత్సరాల వయసులో తుది శ్వాస విడిచారు. ఆ మహనీయునికి స్మృత్యంజలి

# ఎం.సి.ఎ. ఫ్రెషర్స్ పార్టీ
















# హాస్టల్స్‌లో మెయింటినెన్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయండి



హాస్టళ్లను మెరుగుపరచాలని ఆదేశిస్తున్న వీసీ

**25.05.22 (మీడియాసెల్)** విద్యార్థుల సౌకర్యార్థం యూనివర్సిటీలోని హాస్టల్స్ మెయింటినెన్స్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు.బుధవారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని బాయ్స్ హాస్టల్ మరియు గర్ల్స్ హాస్టల్స్‌ను వీసీ పరిశీలించారు. వసతి గృహం లోని గదులు, భోజనశాల, విశ్రాంతి గదులు, వాటర్ సప్లై మరియు హాస్టల్ నిర్వహణ పనులను వీసీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని వసతి గృహాలను పూర్తిస్థాయిలో మెరుగుపరచాలని యూనివర్సిటీ ఇంజనీర్లను ఆదేశించారు. ప్రస్తుతం విద్యార్థులందరికీ సెలవులు కావడంతో వసతి గృహాలలోని విద్యుత్తు, ప్లంబింగ్ వంటి మరమ్మతుల పనులను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు తిరిగి హాస్టల్స్ కు వచ్చేసరికి ఎటువంటి అసౌకర్యాలు లేకుండా అన్ని పనులను పూర్తిచేయాలని ఇంజనీర్లకు తెలియజేశారు. త్వరలో నాక్ బృందం విశ్వవిద్యాలయంలో పర్యటించనున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ఇంజనీర్లు కిరీటి, ప్రేమ్ చంద్, చంద్రశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహ సంతోషి!!

ఓ నేస్తమా!
అద్భుతమైన స్నేహమా
చిరునవ్వుల రూపమా
మైమరిపించే మిత్రమా
అపురూపమైన సాంగత్యమా
అర్థంచేసుకునే అరుదైన నేస్తమా
తెలివికి నిలువెత్తు రూపమా
సమస్యకి సమాధానమా
మనసుదోచిన కొంటె నేస్తమా
మాలో సంతోషాలను నింపే సంతోషమా..
మన స్నేహం శాశ్వతం!!

- ఏ.జె.ఎస్.దీప్తి
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.
పూర్వ విద్యార్థి.









ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో ఈ.ఐ.ఈ., ఈ.సి.ఈ., సి.ఎస్.ఈ., ఐటి విద్యను పూర్తి చేసిన 2018-2022 విద్యార్థుల ముఖ చిత్రాలతో రూపొందించిన టీషర్ట్ డిజైన్.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in